# రాచపుండు

- తమిరిశ జానకి

**బుసలుకొట్టే అతని అహంకారానికి కావల్సిందదే... ఆడది పూర్తిగా అర్థమైపోయినట్లనిపించింది... మొదటినించీ ఉన్న అభిప్రాయం మరింత బలంగా నాటుకుపోయింది. ఔను... ఆడది ఓ బొమ్మ...**

మూడేళ్లు దాటిపోయింది రాజు ఆ ఊరొదిలి పెట్టొచ్చి, మధ్యలో ఎప్పుడూ మళ్ళీ ఆ ఊరిమొహం చూడాల్సిన అవసరం రాలేదు. ఇంక అసలు ఆ అవసరం రాదని అనుకున్నాడు. కానీ, ఆఫీసర్‌గారబ్బాయి పెళ్ళి... వెళ్ళక తప్పనిసరి. పెళ్ళి కూతురిది ఆ ఊరు.

రైలెక్కబోతుంటే ప్లాట్‌ఫామ్ మీద కనిపించాడు పాణి.

"ఎన్నాళ్ళకెన్నాళ్ళకి? ఎక్కడుంటున్నావు ఏవిటి సంగతి?" ప్రస్తుతం ఏ ఊళ్ళో తనుంటున్నదీ చెప్పాడు పాణి.

"చిన్నపనుండి ఈ ఊరొచ్చాను. తిరిగి ఇప్పుడెళ్ళిపోతున్నాను. ఇంకాసేపట్లో రైలుంది. నువ్వీ ఊళ్ళో ఉంటున్నట్టు నాకు తెలియదుగా... తెలిస్తే మీ ఇంటికొచ్చేవాడినే"

"ఈసారెప్పుడైనా వొస్తే తప్పకుండా రా" అడ్రసు రాసిచ్చాడు రాజు.

"నువ్వెక్కడికెళ్తున్నావిప్పుడు?"

"మన ఊరెళ్తున్నాను. మా ఆఫీసర్ గారబ్బాయి పెళ్ళక్కడ" నవ్వుతూ చెప్పాడు 'మన' అన్నమాట నొక్కి పలుకుతూ.

"ఉద్యోగరీత్యా ఊరూరూ తిరిగేవాళ్ళం... మనకో ఊరంటూ ఎక్కడుంది?"

"మనిద్దరికీ స్నేహమైంది ఆ ఊళ్ళోనేగా... అందుకే మనూరన్నాను..."

"ఈ మధ్యనోసారి ఆఫీసు పనిమీద నేనూ ఆ ఊరెళ్ళొచ్చాను. ఒక్కపూటే ఉన్నానక్కడ"

"ఎలా ఉందిప్పుడా ఊరు?"

"ఎలా ఉంటుంది? మనం ఉన్నప్పుడెలా ఉందో అలాగే ఉంది... ఆ.. అన్నట్టు... నువ్వు కొన్నాళ్ళు కథ నడిపావు చూడు... మాస్టారమ్మాయి... పేరేమిటి? మర్చిపోయాను..."

"చిత్ర"... గుర్తుచేశాడు రాజు.

"ఆ... ఆ.. చిత్ర... ఆ అమ్మాయి చెల్లెళ్ళిద్దరికీ పెళ్ళిళ్ళయి పోయాయి... ఆ అమ్మాయి మాత్రం పెళ్ళిచేసుకోలేదు" తుళ్ళిపడ్డాడు రాజు.

"చిత్ర... పెళ్ళి చేసుకోలేదా? ఎందుకని?" చిన్నగా వొణికింది గొంతు.

"ఏమో! నాకేం తెల్సు? ఆ వివరాలన్నీ తెలిసే అవకాశం ఏదీ? నేనా ఊళ్ళో అప్పుడున్నది ఒక్కపూటేగా?... అయినా ఎందుకు చేసుకుని ఉండదో నువ్వామాత్రం ఊహించలేవా? కారణభూతులు తమరేగా?" కళ్ళు చికిలించి నవ్వాడు పాణి.

రైలు ముందుకి కదిలింది.

రాజు ఆలోచనలు వెనక్కి వెళ్ళాయి.

!+!+!+!+!+!+!+!+!

గర్వం, అహంకారం అణువణువునా నిండిఉన్న మగమహారాజు ఎలా ఉంటాడంటే... అందుకు మంచి ఉదాహరణ రాజు. అసలు.. చిన్నతనం నించే అతని స్వభావం అదో మాదిరి...

స్నేహితుల మధ్య కూడా తన ఆధిక్యతే నిలుపుకోవాలని చూసేవాడు ప్రతి విషయంలోనూ. ఆడపిల్లలంటే అతి చులకన...

వాళ్ళకి స్వంత వ్యక్తిత్వం ఉండకూడదు...

మొగవాడు ఆడదాని పాలిటి దైవం... ఆడదానికి ఆధారం...

మొగవాడి అభీష్టానికి అనుగుణంగా నడుచుకోవాలే తప్ప, ఆడది మరోవిధంగా... స్వతంత్ర భావాలతో ఆలోచించకూడదు.. ఇది అతని ఖచ్చితమైన అభిప్రాయం.

లైఫ్ ఎంజాయ్ చెయ్యడానిక్కాక మరెందుకూ కాలేజీ చదువులు?

మహాబలంగా ఏర్పరచేసుకున్న ఈ అభిప్రాయాన్ని అక్షరాలా అమలులో పెట్టాడు.

ఎప్పుడూ వెంట అరడజను మందికి తక్కువ కాకుండా ఉండేవాడు.

జేబులు నిండుగా ఉండేవాడి వెంట వందిమాగధులుండడంలో అశ్చర్యమేముంది?

ఒక్కడే కొడుకయ్యె.. ఆడింది ఆట పాడింది పాట ఇంట్లో....

మాయమాటలు నమ్మి వెంట తిరిగింది కాలేజి బ్యూటీ కల్యాణి. ఆ మాటలు నీటిమీద రాతలని... ఆ ప్రేమ, ప్రేమ కాదు మోజని... ఎప్పుడైతే తెల్సుకుందో... అప్పుడు.. అవమానంతో ఆత్మహత్య చేసుకుంది.

"ఆ... ఇంక అంతకంటే ఏం చెయ్యగలదు?" శాడిస్టులా నవ్వుకున్నాడు రాజు.

ఉద్యోగరీత్యా ఆ ఊరెళ్ళినప్పుడు.. గడ్డిపూలమధ్య గులాబిలా కనపడింది చిత్ర.

జనాభా లెక్కలు సేకరించడానికి...

ఓటర్ల లిస్టు తయారుచెయ్యడానికి...

కొత్త రేషన్ కార్డులు పంపిణీ చెయ్యడానికి...

అన్నిటికీ ఆల్ ఇన్ వన్‌లా ఉపయోగింపబడే బడిపంతులుద్యోగం చిత్ర తండ్రిది.

వెనక ఆస్తి పాస్తులు నాస్తి...

ఒకోసారి వరసగా ఆరేసి నెల్లు జీతాలు రానప్పుడు జ్యేష్ఠ దేవత ఆ ఇంట్లో వేసే మకాం జాస్తి...

"శాపవశాత్తూ ఓ అప్సరస ఆ ఇంట్లో జన్మించింది"

"ఏ ఇంట్లో?"

"మీ ఇంట్లోనే... ఇదిగో ఈ అప్సరసే..." రెండు చేతుల్తో చిత్రని చుట్టేశాడు రాజు.

"అలా అంటే నాకు చాలా బాధగా ఉంటుంది రాజూ. మా ఇంట్లో ధనానికి లోటున్న మాట నిజమే కానీ ఆప్యాయతకీ అనురాగానికీ లోటులేదు"

"గొప్పవాళ్ళింట్లో పుట్టలేదే అని బాధపడలేదా నువ్వెప్పుడూ?"

"ఉహూ... లేదు.. డబ్బు తక్కువైనా... మా ఇంట్లో అందరూ మంచివాళ్ళు... అది చాలు నాకు.. ఏ వున్నా లేకపోయినా మనిషికి కావల్సింది ఎదుటి మనిషి చూపించే ఆపేక్ష అది కావల్సినంత ఉంది మా ఇంట్లో ఒకరి మీదొకరికి..."

ఉత్త సెంటిమెంటల్ ఫూల్... హేళనగా నవ్వుకున్నాడు లోలోపల చిత్ర మాటలకి.

"అందుకే నువ్వంటే నాకు చాలా ఇష్టం... నిన్నెంత ప్రేమిస్తున్నానో మాటల్లో చెప్పలేను..."

"పోనీ నేను చెప్పనా?" కళ్ళల్లోకి చూస్తూ ముసిముసిగా నవ్వింది.

"ఊ... చెప్పు చెప్పు..."

"కుతుబ్‌మినార్ అంత ఎత్తుగా... తాజ్‌మహల్ అంత అందంగా... మద్రాసులో మర్రిచెట్టంత విశాలంగా ప్రేమిస్తున్నావు... ఔనా?" కిలకిలా నవ్వింది ఈసారి.

"అబ్బో! మాటలు బాగానే వొచ్చే!"

"ఎన్ని మాటలొచ్చినా... నువ్వు చూసే చూపులకి నేను చిత్తయిపోవల్సిందే... నీ ముందు నన్ను నేను మర్చిపోవల్సిందేగా"

"అదే...

అదే అతనిలోని అహం కోరుకునేది...

మొగవాడి ముందు ఆడది ఎప్పుడూ తలవొంచవల్సిందే... అదే అతనిక్కావల్సింది."

"ఔనుగానీ రాజూ... మీ ఊరెళ్ళి మీ పెద్దవాళ్ళతో ఎప్పుడు మాట్లాడతావు మన విషయం? వాళ్ళతో చెప్పొచ్చాక మా వాళ్ళతో మాట్లాడతానన్నావు కదా?"

"ఇంకో పదిరోజుల్లో వెళ్తాను..." తనకి ట్రాన్స్‌ఫరయిన సంగతి మాత్రం బయటపెట్టకుండా జాగ్రత్తపడ్డాడు.

!+!+!+!+!+!+!

ఆస్తిపాస్తులున్న సంబంధం ఇంటి ముందుకొస్తే...

చిత్ర గుర్తొస్తుందా?

వొదులుకోవాలనిపిస్తుందా వొచ్చిన అవకాశం?

కాదనగలడా కనకమాలక్ష్మిని?

తండ్రి మాట జవదాటని తనయుడిలా తాళికట్టేశాడు తాయారు మెళ్ళో...

"ఇదేం మనిషి?"... అసలిలాంటి మనుషుల్నేవనాలి?" విస్తుపోయింది తాయారు భర్త ప్రవర్తన చూసి.

ఓపిక పట్టింది కొన్నాళ్ళు...

ఆ తర్వాత అడగకుండా ఉండలేకపోయింది....

"ఔను... నా దృష్టిలో ఆడది ఓ బొమ్మే... అందుకే నేను చెప్పినట్లు ప్రదర్శించ కూడదెందులోనూ కూడా..."

విసురుగా వొచ్చిన జవాబు బల్లెపోటే అయింది.

కళ్ళల్లో నీళ్ళుకుక్కుకుని... గుండెల్లో వేదన నింపుకుని...

మారుమాట్లాడక మిన్నకుండిపోయింది ఎదిరించే ధైర్యం లేక.

అదే.... అదే....

బుసలు కొట్టే అతని అహంకారానికి కావల్సిందదే...

ఆడది పూర్తిగా అర్థమైపోయినట్టనిపించింది...

మొదటినించీ ఉన్న అభిప్రాయం మరింత బలంగా నాటుకుపోయింది. ఔను... ఆడది బొమ్మ... ఆడది ఓ బానిస... ఆడది పడిచస్తుంది తను ప్రేమించిన వాడంటే... ఆడది పడి ఉంటుంది తను పెళ్ళాడిన వాడెలాంటివాడైనా...

గట్టిగా...

కరువుతీరా...

ఆనందంగా....

తృప్తిగా నవ్వుకోవాలనిపించింది రాజుకి.

"తాయారూ..."

"ఏవిటండీ?"

"ఇంకో పదిరోజుల్లో మీ చెల్లెలి పెళ్ళి కదూ?"

"ఔనండి"

"వెళ్తావా?"

అదేవిటలా సందేహంగా అడుగుతాడు?

అర్థంకాలేదు తాయారుకి.....

"వెళ్ళాలని ఉందా?" రెట్టించాడు మళ్ళీ.

ఔనన్నట్టుగా తల ఊగించింది... చెల్లెలి పెళ్ళికి వెళ్ళాలని ఉండదా?"

కనీసం వారంరోజుల ముందైనా ఇద్దరూరండని నాన్న ఉత్తరం రాయలేదా?

"ఓ నెల్లాళ్ళదాకా నాకు ఆఫీసులో సెలవు దొరికే అవకాశం లేదు." గోడ కట్టినట్టే అబద్ధం చాలా తేలిగ్గా చెప్పేశాడు.

"అయ్యో! అయితే... పెళ్ళికి మీరు రాలేరా?" నిరాశ ధ్వనించింది ఆ గొంతులో.

కళ్ళు ఉరిమి చూశాడు. "అంటే... నేను రాలేకపోయినా నువ్వు వెళ్ళొచ్చేద్దావనా నీ ఉద్దేశం?" ఊహించని ఈ ప్రశ్నకి ఏం జవాబు చెప్పాలో తెలియక బిక్క మొహం వేసింది.

మళ్ళీ రెట్టించి అదే ప్రశ్న...

సింహంలా గర్జన...

పెద్దపులిలా చూపులు...

"ఉహూ... మీరు రాకపోతే... నేనెందుకు వెళ్తానండీ? మీరొస్తేనే... అబ్బే... మీరు రాకపోతే నేనూ వెళ్ళను. వెళ్ళలేను..." మాటలు తడబడిపోతుంటే తలదించుకుంది.

గుడ్.. వెరీగుడ్... మనసారా ఆనందించాడు.

ఆ సంతోషం అతని కళ్ళల్లో స్పష్టంగా చూడగలిగిన తాయారుకి... అర్థంకాని ఓ ప్రశ్నగా మిగిలిపోయాడు భర్త.

ఏవిటీ మనిషి?...

అసలేవిటతని తత్వం?....

ఆడవాళ్ళకీ ఓ మనసుంటుందని మీకు తెలియదాండీ?

అడగాలనుంది ఈ ప్రశ్న...

అమ్మో! అడగడమే నోరు తెరిచి!....

అడిగితే నోటిమీద వాత పెట్టడూ?...

ఒంట్లోంచి వొణుకుపుట్టింది...

ప్రయత్నంగా నోటిమీద చేయి అన్చింది...

పొడవైన, నాజూకు వేళ్ళలో సన్నటి కంపనం...

తడబడే అడుగులు వేసేటప్పుడు....

తల్లి కొంగు పట్టుకున్న వేళ్ళు....

అమ్మ, ఆవు అంటూ అక్షరాలు దిద్దేటప్పుడు...

నాన్న చేతిలో భరోసాగా కదిలిన వేళ్ళు...

ఏడు అడుగులు కలిసి నడిచినప్పుడు...

నీ తోడిదే నా జీవితం అంటూ భర్త చేతిని పెనవేసుకుపోయిన వేళ్ళు...

ఈ రోజు... ఇప్పుడు... ఈ క్షణంలో.. ఏ ఆధారం లేనట్టు...

మనసులోని ప్రకంపనాల తాకిడికి కంపిస్తున్నాయి.

!+!+!+!+!+!

తొలి కానుపులోనే కన్నుమూసిన తాయారు కడసారి కనురెప్పలు కదిలించినప్పుడు.. కదలాడిన ఆ ప్రశ్న... కనిపించలేదు రాజు కళ్ళకి...

ఆ ప్రశ్న... అదే... బ్రతికినన్నాళ్ళూ అడగడానికి భయపడిన ప్రశ్న..

అప్పుడడిగాయి చూపులు...

అడిగినందుకు భయపడిపోతున్నట్టుగా మూసుకుపోయాయి కళ్ళవాకిళ్ళు...

ఇప్పుడింక నిశ్చింత ఆత్మకి...

చంటిపిల్ల పెంపకం ఇబ్బంది అవుతుందేమో అని కాస్త బాధపడ్డాడు గానీ... భార్య అకాల మరణానికి అసలే మాత్రం బాధనిపించలేదు రాజుకి.

!+!+!+!+!+!

దిగవల్సిన స్టేషన్ దగ్గిర పడింది.

ఆతృతగా ఉంది రాజుకి చిత్రని కల్సుకోవాలని.

పెళ్ళి చేసుకోలేదుట... ఎందుకో? ఇంకెందుకు? తనని ప్రేమించింది కనక...

మనసొకరితో...

మనువొకరితో పంచుకోడం ఎలా అన్నది ఆడదానికి మాత్రమే కలిగే సందేహం...

తనని ప్రేమించింది కాబట్టి...

మనసులో తననే భర్తగా ఊహించుకోడంవల్ల... మరొకర్ని పెళ్ళాడటం ఇష్టం లేక జీవితాంతం అలా ఉండిపోదల్చుకుందన్నమాట.... అంతే... అలాగే ఉండాలి ఆడదంటే...

తనకేం? తను మొగాడు కాబట్టి ఎంతమందినైనా ప్రేమించి తిరుగుతాడు... ఎవరినైనా పెళ్ళాడతాడు... పోనీ... తన కూతుర్ని... పసిబిడ్డని ప్రేమగా పెంచుతుందో లేదోనన్న అనుమానం ఉంటుంది మరొకర్ని ఎవర్నిచేసుకున్నా.. చిత్ర అయితే... ఇంక అనుమానం అక్కర్లేదు. మనస్ఫూర్తిగా తనని ప్రేమించి... తన కోసం పెళ్లే మానుకున్న మనిషి కాబట్టి... తన బిడ్డని ప్రేమతో సాకి పెద్ద చేస్తుంది... పెళ్ళి చేసేసుకుంటే సరి చిత్రని....

తను అడగడం ఆలస్యం.... వొచ్చి కౌగిట్లో ఒదిగిపోదూ?

"పెద్దలమాట కాదనలేక... వాళ్ళ బలవంతంవల్ల మరొకరి మెళ్ళో తాళి కట్టానేకానీ, నా మనసులో నీకు తప్ప ఇంకెవరికీ స్థానం లేదు చిత్రా" అని ఓ సినిమా డైలాగ్ కొడితే అయిసైపోయి అమాంతం వొచ్చి కాళ్ళమీద పడదూ?...."

ఒక దెబ్బకి రెండు పిట్టలన్నట్టు...

ఎలాగో, మళ్ళీ పెళ్ళి చేసుకోవాలనుకుంటున్న తన కోరికా తీరుతుంది....

పసిబిడ్డని ప్రేమగా చూసుకునే తల్లీ దొరుకుతుంది. హుషారుగా రైలు దిగాడు రాజు.

!+!+!+!+!+!

అదృష్టవశాత్తూ ఇంట్లో చిత్ర ఒక్కతే ఉంది రాజు వెళ్ళేటప్పటికి. ఇంట్లో అంతా ఎక్కడికో వెళ్ళినట్టున్నారు.

"కూర్చో రాజూ..." ఆమె దృష్టిలో అతను ఇంటికొచ్చిన ఓ అతిథి మాత్రమే... అంతకంటే వేరే ఉద్దేశం ఆమెకి లేకపోయినా అతను ఊహించుకున్నది వేరు.

"మీ చెల్లెళ్ళకి పెళ్ళిళ్ళయిపోయాయని... నువ్వు పెళ్ళి చేసుకోలేదని తెల్సింది... చాలా బాధపడుతున్నాము చిత్రా"

చిన్న చిరునవ్వు చిత్ర పెదవుల మీద లాస్యం చేసింది... జీవం లేదు ఆ నవ్వులో.

"కారణం తెలిస్తే మరింత బాధపడతావు రాజూ"

ఈ జవాబు అతని చెవులకెంతో ఇంపుగా అనిపించింది. ఏవుంది కారణం? తనని ప్రేమించడమేగా? తనని మర్చిపోలేకపోడమేగా? "నేను నిన్ను పెళ్ళి చేసుకుంటానిప్పుడు చిత్రా' అని తన నోట్లోంచి ఒక్కమాట రావడం ఆలస్యం ఎగిరిగంతెయ్యదూ..." పాపం! ఇదివరకెలా ఉండేదీ... ఇప్పుడెలా ఉందో? చిక్కిపోయింది... ఆ కళ్ళల్లో అసలు జీవమే లేనట్టుంది... తనమీది ప్రేమతో... తనకి దూరమైన దిగుల్తో ఇలా అయిపోయినట్టుంది... వెరీగుడ్... ఆడదంటే ఇలాగే కదా ఉండాలి.

"నేను మూడు నాలుగేళ్ళకంటే ఎక్కువ బతకనని డాక్టర్లు చెప్పేశారు రాజూ.... అందుకే నేను పెళ్ళి చేసుకోలేదు... లేకపోతే మా చెల్లెళ్ళ పెళ్ళికి ముందు, నాదైపోయి ఉండేది..." మిడిసిపడుతున్న రాజు అహంకారమ్మీద దెబ్బకొట్టినట్టయింది.

"నాకు... నాకు కేన్సర్ రాజూ... ఇంకాట్టే రోజులు బతకను... అందుకే పెళ్ళి చేసుకోలేదు".

అతని కళ్ళల్లో కదలాడినవి జాలీ, సానుభూతీ లాంటివేవీ కాదు. తన ఊహ తప్పయిందన్న అవమాన భారం, కోపం అతని కళ్ళకి ఎఱ్ఱ రంగుని పులిమాయి.

మొహం అదోలా పెట్టి విసురుగా వెళ్ళిపోతున్న రాజుని చిత్రంగా చూస్తూ నిల్చుండిపోయింది చిత్ర. శాస్త్రజ్ఞులు ముందుముందు రాచపుండు వ్యాధిని పూర్తిగా నయం చేసే మందు కనిపెట్టగలరేమో కానీ... రాజులాంటి వాళ్ళల్లో రాచపుండుని మించి వ్యాపించి ఉండే అహంకారపు జబ్బుకి విరుగుడెవరు కనిపెడతారు?....

★☆★☆★